క్లుప్తంగా

16న ఆలయ భూముల వేలం

రాజుపాళెం : మండల పరిధి పగిడాల గ్రామంలోని శ్రీచెన్నకేశవ, ఈశ్వర, ఆంజనేయస్వామి ఆలయాలకు సంబంధించి 68.22 ఎకరాల కౌలుకు ఈనెల 16న వేలం పాట నిర్వహించనున్నట్లు ఈఓ కె.రామచంద్రాచార్యులు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రొద్దుటూరులోని నారాయణరంగయ్యగారి సత్రంలో గురువారం ఉదయం 11 గంటలకు ఈ వేలం పాట నిర్వహించనున్నట్లు ఆయన పేర్కొన్నారు. వేలం పాటలో పాల్గొనే పాటదారులంతా రూ.10 వేలు ధరావత్తు చెల్లించాలని తెలిపారు.

22 నుంచి లక్ష్మీనరసింహుడి బ్రహ్మోత్సవాలు


ప్రత్యేక అలంకరణలో నరసింహస్వామి

గోపవరం : మండల పరిధి వల్లెరవారిపల్లె గ్రామంలోని శ్రీలక్ష్మీ నరసింహస్వామి బ్రహ్మోత్సవాలు ఈ నెల 22వ తేదీ నుంచి 24 వరకు నిర్వహించనున్నట్లు ఆలయ నిర్వాహకులు తెలిపారు. మూడు రోజుల పాటు నిర్వహించే ఈ బ్రహ్మోత్సవాల్లో 22న గణపతి హోమం, ధ్వజారోహణపూజ, 23న స్వామివారి తిరుకల్యాణం, చాందిని బండ్లు, స్వామివారి గ్రామోత్సవం, 24న బండలాగుడు పోటీలు ఉంటాయని వారు పేర్కొన్నారు. స్థానికులతోపాటు చుట్టుపక్కల గ్రామాల నుంచి భక్తులు తరలివచ్చి పాల్గొని స్వామివారిని దర్శించుకోవాలని ఆలయ పూజారి పెంచలయ్యస్వామి తెలిపారు. అన్నదానంతోపాటు వివిధ సాంస్కృతిక కార్యక్రమాలు ఏర్పాటు చేయనున్నట్లు ఆయన పేర్కొన్నారు.

భగీరథ మహర్షి జయంతి


భగీరథ మహర్షి చిత్రపటానికి నివాళి అర్పిస్తున్న సగర సంఘం నాయకులు

ప్రొద్దుటూరు కల్చరల్ : స్థానిక నడిపంల్లెలోని సగర కార్పొరేషన్ డైరెక్టర్ కార్యాలయంలో మంగళవారం భగీరథ మహర్షి జయంతిని వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా సగర కార్పొరేషన్ డైరెక్టర్ ఉప్పర మురళి.. భగీరథుని చిత్రపటానికి పూలమాల వేసి నివాళి అర్పించారు. భగీరథుడు సగరుల ఆరాధ్య దైవమని ఆయన గొప్పతనాన్ని వివరించారు. సగర సంఘం జిల్లా అధ్యక్షుడు మజ్జారి వీరమోహన్ మాట్లాడుతూ భగీరథుడు తన కఠోర తపస్సుతో దివి నుంచి భువికి గంగను తీసుకువచ్చిన మహనీయుడని కొనియాడారు. కార్యక్రమంలో సగర సంఘం నాయకులు సీతంపల్లె రవి, పల్లవోలు అగ్గిరాముడు, కిరణ్, మజ్జారి శ్రీను, మజ్జారి లక్ష్మీనారాయణ, వెంకటరమణ, సురేష్, సీతంపల్లె విజయకుమార్ తదితరులు పాల్గొన్నారు.

వికలాంగుల సంఘం ఉపాధ్యక్షుడిగా నాగరాజు


కన్నెలూరు నాగరాజు

వీరపునాయునిపల్లె : ఆంధ్రప్రదేశ్ వికలాంగుల హక్కుల పోరాట సమితి జిల్లా ఉపాధ్యక్షుడిగా పాలగిరి గ్రామానికి చెందిన కన్నెలూరు నాగరాజు ఏకగ్రీవంగా ఎంపికయ్యారు. రాష్ట్ర అధ్యక్షుడు అన్నం చిన్న సుబ్బయ్య యాదవ్ ద్వారా మంగళవారం నియామక పత్రం అందినట్లు నాగరాజు తెలిపారు. మండలంలోనే కాకుండా జిల్లాలో ఉన్న వికలాంగులు ఎవైనా సమస్యలు ఉంటే వెంటనే నా దృష్టికి తీసుకురావాలని వాటిని పరిష్కరించేందుకు కృషి చేస్తానని ఆయన తెలిపారు.

భక్తిశ్రద్ధలతో జ్యోతి ఉత్సవం


ప్రత్యేక అలంకరణలో చౌడేశ్వరిదేవి

చిన్నమండెం : మండల పరిధిలోని దేవగుడిపల్లె గ్రామ పంచాయతీలోని కొండమూల గ్రామంలో వెలసిన శ్రీ చౌడేశ్వరీదేవి ఉత్సవాలను మంగళవారం రాత్రి తొగటవీర క్షత్రియ సంఘం వారిచే అంగరంగ వైభవంగా నిర్వహించినట్లు ఆలయ కమిటీ సభ్యులు, గ్రామస్తులు తెలిపారు. మంగళవారం ఉదయం అమ్మవారికి అభిషేకాలు, పూజలు నిర్వహించి సాయంత్రం 4 గంటల నుంచి జ్యోతులను తయారు చేశారు. ఈ జ్యోతులను శ్రీ చౌడేశ్వరి దేవి అమ్మవారిని రాత్రి 9 గంటల నుంచి సింహ వాహనంపై కొలువుదీర్చి ఊరేగించనున్నారు. అలాగే అగ్నిగుండ ప్రవేశం కార్యక్రమం చేయనున్నారు. కార్యక్రమానికి వివిధ రాష్ట్రాల నుంచి పెద్దఎత్తున తొగట వీర క్షత్రియ సంఘం కుటుంబసభ్యులు, భక్తాదులు వేలాదిగా పాల్గొన్నారు.

బంపర్ మెజార్టీతో గెలుస్తాం

- 175 స్థానాలు కైవసం చేసుకుంటాం
- కృతజ్ఞతా సభలో ఎమ్మెల్యే రవీంద్రనాథ్‌రెడ్డి వెల్లడి


మీడియా సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే రవీంద్రనాథ్‌రెడ్డి

కమలాపురం : రాష్ట్ర వ్యాప్తంగా జరిగిన ఎన్నికల్లో వైఎస్సార్ సీపీ అభ్యర్థులు బంపర్ మెజార్టీతో గెలుస్తారని, జగనన్న చెప్పిన విధంగా 175 స్థానాలు కైవసం చేసుకుంటామని ఎమ్మెల్యే రవీంద్రనాథ్‌రెడ్డి స్పష్టం చేశారు. మంగళవారం స్థానిక వైఎస్సార్ సీపీ కార్యాలయంలో ఆయన కార్యకర్తలు, అభిమానులు, నాయకులతో నిర్వహించిన సమావేశంలో మాట్లాడారు. వైఎస్సార్ సీపీ అభ్యర్థుల గెలుపునకు కృషి చేసిన ప్రతి ఒక్కరికి కృతజ్ఞతలు, అభినందనలు తెలిపారు. అనంతరం మీడియా సమావేశంలో ఎమ్మెల్యే మాట్లాడుతూ రాష్ట్ర వ్యాప్తంగా వైఎస్సార్ సీపీ అభ్యర్థులు బంపర్ మెజార్టీతో గెలవడమే కాక 175 స్థానాలు కైవసం చేసుకుంటామని ధీమా వ్యక్తం చేశారు. 13న జరిగిన ఓటింగ్‌లో సరళిని చూస్తుంటే ప్రజలకు జగనన్నపై నమ్మకం, విశ్వాసం మరింత పెరిగిందన్నారు. ఉదయం 6 గంటలకే మహిళలు బారులు తీరారని, ఇదంతా చూస్తుంటే ప్రజలంతా ఏకతాటిపైకి వచ్చి జగనన్నను రెండో సారి సీఎం చేస్తున్నారని అనిపిస్తుందన్నారు. వైఎస్సార్ సీపీపై ప్రతిపక్షాలు ఎన్ని అభాండాలు వేసినా ప్రజలు నమ్మలేదన్నారు. ల్యాండ్ టైట్లింగ్ యాక్ట్ అనేది కేంద్ర ప్రభుత్వంలోని అంశం అన్నారు. మన రాష్ట్రంలో రీసర్వే పూర్తి కావడంతో ఈ చట్టం వినియోగంలోకి వచ్చే అవకాశం ఉందన్నారు. ఇతర రాష్ట్రాల్లో తాలూకాకు ఒక సర్వేయర్ ఉంటారని, వారు భూ రీసర్వే పూర్తి చేశాక ల్యాండ్ టైట్లింగ్ యాక్ట్ అమల్లోకి వస్తుందన్నారు. ఏపీలో జగనన్న ప్రవేశ పెట్టిన సచివాలయ వ్యవస్థ ద్వారా భూ రీసర్వే త్వరగా పూర్తి అయిందన్నారు. పేద ప్రజలకు భూములు ఇవ్వడమే జగనన్నకు తెలుసని, ప్రజల భూములు లాక్కోవడం తెలియదన్నారు. రామోజీరావు, ఇతర పత్రికల యాజమాన్యాలు యాక్ట్ పూర్తిగా చదివి వార్తలు ప్రచురించాలని, పచ్చ మీడియా బాబు చెప్పిందే అచ్చు వేస్తున్నారని మండి పడ్డారు. ప్రతిపక్షాలు ఏవైన లోపాలు ఉంటే సరిదిద్దాలే గాని ఇలా వక్రీకరించ కూడదని హితవు పలికారు. చాలా మందికి వారి వంశస్థుల పేర్లపైనే భూములు ఉన్నాయని, ఈ యాక్ట్ ద్వారా వారి పేర్లపై భూములు మారుతాయన్నారు. 2016లో చుక్కల భూములు రిజిష్టర్ చేయవద్దని బాబు జీఓ జారీ చేశారని, జగనన్న ప్రభుత్వం వాటిని రెగ్యులరైజ్ చేసి రిజిస్ట్రేషన్ చేసేలా చర్యలు తీసుకుందన్నారు. రెవెన్యూ వ్యవస్థను ప్రక్షాళన చేయడానికే ఈ యాక్ట్ వచ్చిందన్నారు. డీబీటీ ద్వారా ప్రజలకు అనేక పథకాలు చేరాయని, జగనన్న పనితీరుతో నెంబర్ వన్ సీఎం అని అన్ని సర్వేలు చెబుతున్నాయని ఎమ్మెల్యే వివరించారు. నియోజకవర్గ నాయకుడు సాయినాథ శర్మ మాట్లాడుతూ 85 శాతం మంది వైఎస్సార్ సీపీ వైపే మొగ్గు చూపారన్నారు. ఇండస్ట్రీస్ స్టేట్ అడ్వైజర్ రాజోలి వీరారెడ్డి మాట్లాడుతూ 20వేల మెజార్టీతో రవీంద్రనాథ్‌రెడ్డి గెలుస్తారన్నారు. హార్టికల్చర్ స్టేట్ అడ్వైజర్ సంబటూరు ప్రసాద్‌రెడ్డి మాట్లాడుతూ చంద్రబాబు సూపర్ సిక్స్ ద్వారా అన్ని హామీలిచ్చినా మహిళలు బాబును నమ్మలేదన్నారు. కరోనా కష్టకాలంలో సైతం సంక్షేమ పథకాలు ఆగలేదన్నారు. జగనన్నపై నమ్మకం, విశ్వాసంతోనే మహిళలు, వృద్ధులు ఓట్లు వేయడానికి వచ్చారన్నారు. సమావేశంలో వైఎస్సార్ సీపీ నాయకులు ఉత్తమారెడ్డి, రాజుపాళెం సుబ్బారెడ్డి, సుమిత్రా రాజశేఖర్‌రెడ్డి, ఎస్సీ పుల్లారెడ్డి తదితరులు పాల్గొన్నారు.


బుసిరెడ్డిపల్లెలో శ్రీనివాసులరెడ్డి కుటుంబ సభ్యులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే రవీంద్రనాథ్‌రెడ్డి

కార్యకర్తలకు అండగా ఉంటాం

వీరపునాయునిపల్లె : వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ విజయం కొరకు కృషి చేసిన ప్రతి కార్యకర్తకు పార్టీ అండగా ఉంటుందని ఎమ్మెల్యే రవీంద్రనాథ్‌రెడ్డి అన్నారు. మంగళవారం బుసిరెడ్డిపల్లె, వెంకటాపురం గ్రామాల్లో ఆయన పర్యటించి తెలుగుదేశం పార్టీకి చెందిన అల్లరి మూకల దాడిలో గాయపడ్డ వైఎస్సార్‌సీపీ కార్యకర్తలను పరామర్శించారు. ధైర్యంగా ఉండాలని, మీకు అండగా పార్టీ ఉంటుందన్నారు. తెలుగుదేశం కార్యకర్తలు పోలింగ్ కేంద్రం వద్ద ఉన్నా కూడా ఎస్ఐ వెంకటరెడ్డి వారిపై చర్యలు తీసుకోకుండా వైఎస్ఆర్‌సీపీ కార్యకర్తలను బూతులు తిట్టడంతో పాటు కొట్టడం జరిగిందన్నారు. ఎస్ఐ వెంకటరెడ్డిపై జిల్లాస్థాయి అధికారులకు ఫిర్యాదు చేస్తామన్నారు. అల్లర్లకు పాల్పడిన వారిపై చట్ట ప్రకారం కేసులు నమోదు చేయాలన్నారు. రాష్ట్ర మైనింగ్ డైరెక్టర్ వీరప్రతాప్‌రెడ్డి, మండల అధ్యక్షుడు రఘునాథరెడ్డి, జేసీసీ కన్వీనర్ మహేంద్రారెడ్డి, పుణ్యభూమి చారిటబుల్ ట్రస్టు అధినేత సాయినాథ శర్మ, మండల పరిశీలకుడు రాజుపాలెం జగన్‌రెడ్డి, తదితరులు ఆయన వెంట ఉన్నారు.

సంక్షేమ ప్రభుత్వాన్ని ఓటర్లు ఆదరించారు

రాష్ట్రంలో సోమవారం జరిగిన సార్వత్రిక ఎన్నికల్లో సంక్షేమ ప్రభుత్వాన్ని రాష్ట్ర ప్రజలు పూర్తిస్థాయిలో ఆదరించారని ఎమ్మెల్యే రవీంద్రనాథ్‌రెడ్డి అన్నారు. మంగళవారం స్థానిక పార్టీ కార్యాలయంలో ఆయన నాయకులు, కార్యకర్తలతో సమావేశం నిర్వహించి మాట్లాడారు. ఈ ఎన్నికల్లో సీఎం జగన్‌మోహన్‌రెడ్డిని ఆశీర్వదించేందుకు ఉదయం 6 గంటల నుంచే వృద్ధులు, మహిళలు అధిక సంఖ్యలో పోలింగ్ కేంద్రానికి చేరుకున్నారన్నారు. ఎన్నికల ప్రచారం ప్రారంభమైనప్పటి నుంచి పోలింగ్ పూర్తయ్యేంత వరకు ఇష్టపడి కష్టపడి చేసిన ప్రతి నాయకుడు, కార్యకర్తకు ప్రత్యేకంగా ఆయన అభినందనలు తెలియజేశారు. కమలాపురం నియోజకవర్గంలో మూడవ సారి వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ జెండా ఎగురవేయడం ఖాయమన్నారు. కార్యక్రమంలో మండల అధ్యక్షుడు రఘునాథ్‌రెడ్డి, జేసీసీ కన్వీనర్ మహేంద్రారెడ్డి, మండల పరిశీలకుడు రాజుపాలెం జగన్‌రెడ్డి, సర్పంచులు, ఎంపీటీసీలు పాల్గొన్నారు.

కమలాపురం నియోజకవర్గంలో 84.44శాతం పోలింగ్

- మొత్తం ఓటర్లు 2,04,169
- పోలైన ఓట్లు 1,72,401
- కమలాపురం మండలం తురకపల్లెలో అత్యధికంగా 98.05శాతం
- చెన్నూరు పట్టణం 65వ బూత్‌లో అత్యల్పంగా 66.77శాతం నమోదు
- స్ట్రాంగ్ రూంలకు తరలించిన ఈవీఎంలు


లోడింగ్ అనంతరం వాహనాల్లో తరలిస్తున్న దృశ్యం

కమలాపురం : నియోజకవర్గంలో 2019 కంటే ఇప్పుడు పోలింగ్ శాతం పెరిగిందని అధికారులు తెలిపారు. నియోజకవర్గంలో 84.44శాతం పోలింగ్ నమోదైనట్లు ఆర్‌ఓ గణేష్‌కుమార్ తెలిపారు. నియోజకవర్గంలో కమలాపురం మండలంలోని తురకపల్లెలో అత్యధికంగా 98.05శాతం పోలింగ్ నమోదు కాగా, చెన్నూరు పట్టణంలోని 65వ బూత్‌లో అత్యల్పంగా 66.77 శాతం పోలింగ్ నమోదైనట్లు అధికారుల లెక్కలు తెలుపుతున్నాయి. కమలాపురం మండలంలోని తురకపల్లెలో అత్యధిక శాతం పోలింగ్ నమోదు కాగా, కోగటం 4వ బూత్‌లో అత్యల్పంగా 70.14శాతం పోలింగ్ నమోదు అయింది. నియోజకవర్గంలోని ఆరు మండలాల్లో 2,04,169 ఓట్లు ఉండగా సోమవారం జరిగిన పోలింగ్‌లో 1,72,401 మంది ఓటర్లు తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. ఇందులో 83,861 మంది పురుషులు ఉండగా, 88,528 మంది మహిళలు, ఇతరులు 12 మంది ఉన్నారు. కాగా ప్రతి మండలంలో పురుషుల కంటే మహిళలే ఎక్కువగా ఓట్లు వేశారు. సీకేదిన్నె మండలంలో పురుషుల కంటే 1464 మంది మహిళలు ఎక్కువగా ఓటు వేశారు. వల్లూరులో అత్యల్పంగా పురుషుల కంటే 113 మంది మహిళలు ఎక్కువగా ఓటు హక్కు వినియోగించుకున్న వారిలో ఉన్నారు. అలాగే కమలాపురంలో పురుషుల కంటే 1360 మంది మహిళలు ఎక్కువగా ఓటేశారు. అలాగే చెన్నూరులో 819 మంది, వీఎన్‌పల్లెలో 510 మంది, పెండ్లిమర్రిలో 401 మంది ఎక్కువగా ఓట్లు వేశారు.

భద్ర పరిచిన ఈవీఎంలు

పోలింగ్ పూర్తి చేసిన అనంతరం ఈవీఎంలను శుక్రవారం భారీ భద్రత నడుమ స్ట్రాంగ్ రూములకు తరలించారు. ఆర్‌ఓ గణేష్ కుమార్, ఏఆర్‌ఓ సుబ్రహ్మణ్యాల పర్యవేక్షణలో ప్రత్యేక వాహనాల్లో 251 ఈవీఎం, వీవీ ప్యాట్‌లను నింపి సీల్ చేసి కడపలోని స్ట్రాంగ్ రూములకు తరలించారు. భారీ భద్రత నడుమ డిస్ట్రిబ్యూషన్ సెంటర్ నుంచి స్ట్రాంగ్ రూములకు వాటిని తరలించారు.

కమలాపురం నియోజకవర్గంలో పోలైన ఓట్ల వివరాలు					
మండలం	మొత్తం ఓట్లు	పోలైనఓట్లు	పురుషులు	మహిళలు	ఇతరులు
కమలాపురం	41,200	34,848	16,742	18,102	4
చెన్నూరు	30,803	25,661	12,419	13,238	4
వల్లూరు	22,562	19,959	9,923	10,036	0
వీఎన్ పల్లె	25,162	21,977	10,733	11,243	1
పెండ్లిమర్రి	35,733	31,206	15,402	15,803	1
సీకేదిన్నె	48,709	38,750	18,642	20,106	2
మొత్తం	2,04,196	1,72,401	83,861	88,528	12


వాహనంలోకి ఈవీఎంలు లోడింగ్ చేస్తున్న సిబ్బంది

స్ట్రాంగ్ రూముల పరిశీలన


అధికారులతో మాట్లాడుతున్న నగరపాలక కమిషనర్ ప్రవీణ్‌చంద్

కడప కార్పొరేషన్: ఎన్నికలకు సంబంధించి 7 నియోజకవర్గాల కౌంటింగ్ సెంటర్ (మౌలానా అబుల్ కలాం ఆజాద్ పాలిటెక్నిక్ కళాశాల)ను నగరపాలక కమిషనర్ జీఎస్ఎస్ ప్రవీణ్‌చంద్ పరిశీలించారు. ఈ సందర్భంగా అక్కడి ఏర్పాట్లను పర్యవేక్షించారు. అన్ని నియోజకవర్గాలకు సంబంధించి స్ట్రాంగ్ రూములను తనిఖీ చేసి, అవసరం లేని వస్తువులను స్ట్రాంగ్ రూమ్స్‌లో ఉంచకుండా తీయించాలని సూచించారు. కౌంటింగ్ కేంద్రంలో మూడంచల భద్రత ఏర్పాటు చేయాలని పోలీసులను ఆదేశించారు. కడప నియోజకవర్గానికి సంబంధించి ఈవీఎం బాక్సులను ఐరన్ ర్యాక్స్‌లో పోలింగ్ స్టేషన్ నంబర్లపై అమర్చేలా చర్యలు తీసుకోవాలన్నారు. నగరపాలక సంస్థ సిబ్బందితో అన్ని నియోజకవర్గాలకు సంబంధించిన స్ట్రాంగ్ రూముల్లో ఈవీఎంలను అమర్చేలా చర్యలు తీసుకోవాలన్నారు. ప్రతి నియోజకవర్గానికి సంబంధించి ఈవీఎంల నంబర్ల డేటాను ఏర్పాటు చేసి వాటి ప్రకారం ఈవీఎంలను రాక్స్‌లలో అమర్చే విధంగా చర్యలు చేపట్టాలని సూచించారు. కౌంటింగ్ సెంటర్‌కి ఈవీఎం మిషన్‌ను తీసుకువచ్చిన ప్రతి ఒక్కరికీ అల్పాహారం, భోజన సదుపాయాలు ఏర్పాటు చేయాలన్నారు. ఎండ తీవ్రత ఎక్కువగా ఉన్నందున హమాలీలకు మజ్జిగ ఏర్పాటు చేయాలని తెలిపారు. ఏ నియోజకవర్గానికి సంబంధించిన ఈవీఎంలను ఆయా నియోజకవర్గాలకు సంబంధించిన స్ట్రాంగ్ రూముల్లో భద్రపరచాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో అధికారులు పాల్గొన్నారు.

కైఫియత్తులే ఇంటిపేరుగా 'కట్టా'

నేడు కట్టా నరసింహులు వర్ధంతి



కడప కల్చరల్ : కైఫీయత్తుల పరిష్కర్తగా విద్యాన్ కట్టా నరసింహులు ఖ్యాతిగడించారు. నిజానికి ఆయన సాహితీవేత్తగా కంటే 'కైఫియత్తుల కట్టా'గానే తెలుగు వారికి సుపరిచితులు. నేడు ఆయన వర్ధంతి సందర్భంగా ఆయన గురించి..

- ఒంటిమిట్ట సమీపంలోని కొత్తపల్లి కు చెందిన కట్టా నరసింహులు తెలుగు పండితుడిగా సేవలందించారు. కొన్ని అవధానాలు చేశారు. డాక్టర్ జానమద్ది హనుమచ్ఛాస్త్రితో పరిచయం కట్టా పదవీ విరమణ తర్వాత ఆయనను సీపీ బ్రౌన్ గ్రంథాలయానికి చేర్చింది. భాష, పరిశోధనలపై కట్టాకుగల ఆసక్తిని గమనించిన డాక్టర్ జానమద్ది బ్రౌన్ గ్రంథాలయ తాళపత్ర గ్రంథాల విభాగాన్ని పటిష్ఠం చేసే బాధ్యతను, ఆ తర్వాత మెకంజీ రాసిన కడప కైఫియత్తుల పరిష్కార బాధ్యతను అప్పగించారు. 8 సంపుటాలు 3000 పైచిలుకు పేజీలతో వాటిని పరిష్కరించి వాటి సారాంశాన్ని అందుబాటులోకి తెచ్చారు కట్టా. ఎనిమిదేళ్లపాటు జిల్లా చరిత్రలో మరుగున పడిన పలు చారిత్రిక అంశాలను వెలికితీసిన ఆయన కడప కైఫియత్తుల ఆధారంగా జిల్లా చారిత్రక అంశాలతో 'కైఫియత్ కథలు' పేరిట పుస్తకం వెలువరించారు.
- భక్తకన్నప్ప జన్మస్థలి రాజంపేటలోని ఊటుకూరు గ్రామమేనని వెలుగులోకి తెచ్చారు. రాయల ఆస్థానంలోని అష్టదిగ్గజాల లాగానే మట్లి రాజుల వద్ద కూడా అష్టదిగ్గజ కవులుండేవారని తన పరిశోధనల్లో వెలికితెచ్చారు.
- రాష్ట్ర విభజన నేపథ్యంలో ఒంటిమిట్ట ఆలయ చరిత్రకు సంబంధించిన శాసనాలు, ఇతర అంశాలను వెల్లడించి ఆ ఆలయానికి ప్రభుత్వ లాంఛనాలు లభించడంలో కృషి చేశారు.
- ఈ కృషి ఆయనకు తిరుమల తిరుపతి దేవస్థానాల ఆధ్వర్యంలోని పోతన భాగవతం ప్రాజెక్టులో సేవలందించే అవకాశాన్ని కల్పించింది. అక్కడ పనిచేస్తూనే ఆయన 2021 మే 15న కన్నుమూశారు.

కాపాడు తల్లీ... విజయదుర్గమ్మ

కడప కల్చరల్ : కడప నగరం శ్రీ విజయదుర్గాదేవి ఆలయంలో ప్రతి మంగళవారం లాగానే ఈసారి కూడా రాహుకాల పూజలు నిర్వహించారు. రాహుకేతువు గ్రహ ప్రభావంతో ఏర్పడే బాధలు తొలగిపోతాయన్న విశ్వాసంతో భక్తులు విశేష సంఖ్యలో ఈ పూజలకు హాజరయ్యారు. తొలుత అమ్మవారి మూలమూర్తికి విశేష అభిషేకాలు, అలంకారం, అర్చనలు చేశారు. అనంతరం భక్తులకు దర్శనభాగ్యం కల్పించారు. దర్శనానంతరం భక్తులు ఆలయ ప్రాంగణంలో రాహుకాల పూజలు నిర్వహించారు. ఆలయ ప్రధాన అర్చకులు భక్తులకు పూజా విధానాన్ని వివరిస్తూ కార్యక్రమం నిర్వహింపజేశారు.


పూజా కార్యక్రమంలో పాల్గొన్న మహిళలు

ప్రజా పీఠంతో ప్రజలకు న్యాయం


సమావేశంలో మాట్లాడుతున్న మేజిస్ట్రేట్ లావణ్య

కమలాపురం : ప్రజా పీఠంతో ప్రజలకు న్యాయం జరుగుతుందని కమలాపురం జూనియర్ సివిల్ కోర్టు మెజిస్ట్రేట్ ఎస్.లావణ్య తెలిపారు. మంగళవారం స్థానిక కోర్టు ఆవరణలో న్యాయవాదులతో నిర్వహించిన సమావేశంలో ఆమె మాట్లాడారు. ఈనెల 29న జరిగే లోక్ అదాలత్ గురించి కక్షిదారులకు అవగాహన కల్పించాలన్నారు. ముఖ్యంగా కక్షిదారులతో వేరు వేరుగా మాట్లాడి రాజీ మార్గం వలన జరిగే ప్రయోజనాలను వివరించాలన్నారు. కక్షలు, కార్పణ్యాలను లోక్ అదాలత్ దూరం చేస్తుందన్నారు. లోక్ అదాలత్‌లో కేసులు పరిష్కారం చేసుకున్న తర్వాత ఇరు పార్టీలు స్నేహభావంతో ఉంటారన్నారు. న్యాయవాదులు మధ్యవర్తిత్వం వహించి కక్షిదారుల కేసులు పరిష్కారం అయ్యేలా చూడాలన్నారు. కార్యక్రమంలో కమలాపురం బార్ అసోసియేషన్ అధ్యక్షుడు పుష్పరాజు, సహాయ కార్యదర్శి ఉదయ్ కిరణ్, న్యాయవాదులు నారాయణరెడ్డి, మహేష్, శివ తదితరులు పాల్గొన్నారు.

కడప నియోజకవర్గంలో 144 సెక్షన్

- జూన్ 6 వరకు అమలు
- కడప డీఎస్పీ ఎం.డి షరీఫ్



కడప అర్బన్: కడప అసెంబ్లీ నియోజక వర్గ పరిధిలో ఈనెల 14 వ తేదీ ఉదయం నుంచి జూన్ 6వ తేదీ వరకు జిల్లా ఎన్నికల అధికారి (జిల్లా కలెక్టర్) జారీ చేసిన ఉత్తర్వుల మేరకు సెక్షన్ 144 అమలులో వుంటుందని కడప డీఎస్పీ ఎండి. షరీఫ్ ఒక ప్రకటనలో తెలియజేశారు. సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో శాంతి భద్రతలను పరిరక్షించడానికి, ఎన్నికల నిర్వహణలో అవాంఛనీయ సంఘటనలను నివారించడం కోసం కడప నియోజక వర్గ పరిధిలోని కౌంటింగ్ సెంటర్‌గా గుర్తించిన మౌలానా అబ్దుల్ కలాం నేషనల్ ఉర్దూ యూనివర్శిటీ (ఎంఎన్‌యుయు) పరిసర ప్రాంతంలో సెక్షన్ 144 అమలులో వుంటుందని తెలిపారు. ఈనెల 31 వరకు కడప పోలీస్ సబ్ డివిజన్ పరిధిలో సెక్షన్ 30 పోలీస్ యాక్ట్ కూడా అమలులో వుందని గుర్తు చేశారు. సభలు, సమావేశాలు, ర్యాలీలు, నిరసన కార్యక్రమాలు చేపట్టాలంటే 24 గంటల ముందు లిఖితపూర్వకంగా పోలీసు వారికి అర్జీ ఇచ్చి వారి నుంచి ముందస్తు అనుమతి తీసుకోవాలన్నారు. అలా కాని పక్షంలో చట్టపరమైన చర్యలకు బాధ్యులవుతారని ఆయన హెచ్చరించారు.

పొంగి పొర్లుతున్న డ్రైనేజీ నీరు



కడప కార్పొరేషన్: కడప నగరంలోని మినీ బైపాస్ రోడ్డులో శ్రీనగర్ కాలనీ వద్ద భూగర్భ డ్రైనేజీ నీరు పొంగిపొర్లుతోంది. ఇదంతా బైపాస్ రోడ్డుపైకి రావడంతో ఇటువైపు రాకపోకలు సాగించేవారికి తీవ్ర ఇబ్బందిగా మారింది. నల్లగా, పాచిపట్టిన ఈ డ్రైనేజీ నీటి వల్ల ఈగలు, దోమలు వ్యాపిస్తున్నాయి. అనేక మాసాలుగా డ్రైనేజీనీరు రోడ్డుపైకి వస్తున్నా నగరపాలక సిబ్బందిగానీ, అధికారులుగానీ స్పందించలేదని స్థానికులు ఆరోపిస్తున్నారు. ఇప్పటికైనా స్పందించి డ్రైనేజీ నీరు రోడ్డుపైకి రాకుండా తగిన చర్యలు తీసుకోవాలని వారు కోరుతున్నారు.

గంగమ్మ తల్లికి పూజలు


ప్రత్యేక అలంకరణలో అమ్మవారు

రాజుపాళెం : మండల పరిధి అర్కటవేముల గ్రామంలోని పాత గంగమ్మ ఆలయంలో మంగళవారం గంగమ్మ జయంతి ఉత్సవాలు వైభవంగా నిర్వహించారు. ఉదయం నుంచి అమ్మవారిని ప్రత్యేకంగా అలంకరించిన అనంతరం కుంకుమార్చనలు, అభిషేకాలు, విశేష పూజలు చేశారు. అలాగే పారాయణం, భజన సంకీర్తనలతో ఆలయం మారుమోగింది. మహిళలు కాయాకర్పూరం సమర్పించి పూజలు చేశారు. అన్నదాన కార్యక్రమం ఏర్పాటు చేశారు.

ఈతతో.. సరదా



పులివెందుల రూరల్ : ఎండ తీవ్రత ఎక్కువ కావడంతో ఉక్కపోతకు ఉండలేక.. ఉపశమనం కోసం కాలువల వద్దకు వెళ్లి సరదా.. సరదాగా ఈత కొడుతున్నారు. పులివెందుల ప్రాంత ప్రజలు ఇలా సరదాగా ఈతకొడుతున్న దృశ్యాలను సాక్షి కెమెరా క్లిక్‌మనిపించింది. చిన్నపిల్లలు సైకిల్ ట్యూబ్‌లు, క్యాన్‌లు కట్టుకుని ఈత కొడుతున్నారు.